# అగ్గి రాజుకొంటుంది

—వేల్పుల

తోక తెగిన కుక్కలాగే కూస్తూనే ఉంది సైరన్. ఆ కూతకు సంకేతంగా కార్మికవాడల్లో బొగ్గుపొయ్యిల మంటలు పైకి లేస్తూనే ఉన్నాయి. ఆ మంటల్లో నుండి వచ్చిన పొగ గుడిసెల చుట్టూ అలుముకొని పరిసరాలను బంధించాయి. ఎటూ ఏమీ కనిపించనంత దట్టంగా ఉందా పొగ. దానికితోడు గుడిసెలమధ్య ఇరుకుగా ఉన్న తోవ్వలు, సందులు, అందులో అప్పుడే అటూ ఇటూ, ఉరుకులు పరుగులు తీస్తున్న కుక్కలు,పందులు వచ్చిపోయే మనుషులను బలంగా ఢీకొంటూ భయంతో అరుస్తున్నాయి.

తూర్పు ఆకాశంలో సూరీడు తూటాలు పేల్చే సమయం. ఇంకా పూర్తిగా తెలవారలేదు, పంపునీల్లకోసం పరుగులు తీసే కార్మిక స్త్రీలతో ఆ సమయంలో ఎప్పుడూ ఆ వాడంతా అలికిడిగానే ఉంటుంది. బిందెలు పట్టుకొని కోసెడంత లైనుగా నిలబడ్డ స్త్రీలు రోజు ఎవరో ఒకరు కలహించుకోవడం మామూలే.

గాలికి రాజుకొని ఎర్రని నిప్పులతో మండిపడే బొగ్గుపొయ్యిని బయటనుండి లోనకు తీసుకుపొయ్యి దానిమీద బియ్యం కడిగి పెట్టింది మల్లమ్మ.

ఆ బొగ్గు పొయ్యిదగ్గర కొద్దిసేపు కూచుండి చలి కాచుకొని లేచి వాకిలి ఊడ్చి, నిన్నటి నీల్లు గోలంలోవి తీసి అలుకు చల్లింది. బొగ్గుపొయ్యిమీద అన్నం గిన్నె దించి క్రిందపెట్టి చేత బిందె పట్టుకొని మొద్దునిద్ర పోతున్న భర్తను తట్టి లేపింది మల్లమ్మ.

---

*కథల పోటీలో రెండవ బహుమతి రూ. 150 పొందిన కథ.*

---

రాజయ్య కసురుకుంటూ "అబ్బ ఆగలేవె. పెయ్యంత నొప్పిగుంటే మద్యలో నువ్వేందే: లేస్తగాని సైసలేవు." అంటూ మల్ల ముసుగు పెట్టుకున్నాడు.

"రాత్రంత బగ్గదాగి తిండి తినకుంటే వంటే నొప్పి గుండకుంటే మరే ముంటది. సరెగాని దూటికి టైమైతంది లే లే." అంటూ కోపంగా మందలించింది మల్లమ్మ.

"రోజు పొద్దుగాల్నే గుడిలేసే రికార్డోలే అదురుడు దప్ప నీకేం వస్లేదా." అంటూ కసురుకున్నాడు రాజయ్య.

"పనుంటే నువ్వార్సెటోనివా తీర్సెటోనివా గని, నేను బొయ్యి బిందెదన్ని సీల్లుదెత్త. జెర ఇంట్లకేమైన వత్తె సూడు" అంటూ తలుపు దగ్గరవేసి సరసర బయటకు నడిచింది. భర్త "ఆఁ ఆ" అంటూ మల్ల నిద్రలోకి జారుకున్నాడు.

దగ్గరకేసిన తలుపును నెట్టుకొని మెల్లగా లోపలికి వెళ్ళింది కుక్క. కొద్ది సేపు అటూ ఇటూ చూసి, అప్పుడే వండిన వేడివేడి అన్నం గిన్నెలో మూతి బెట్టింది. అది సర్రున కాలేసరికి మూతిని ప్రక్కకు తిప్పేసరికి ఆ గిన్నె బోర్ల పడింది. క్రిందపడ్డ అన్నం కొంత చెల్లాచెదురుగా పడగా వేడి తగ్గడంవల్ల తిన సాగింది.

అప్పుడే ఉరుకులు పరుగులతో బిందెడు నీళ్ళతో వచ్చిన మల్లమ్మ గుడిసె ముందు ఆగి భుజంమీదనుండి బిందె దింపి రెండు చేతులలో అమాంతం పట్టుకొని వంగి ఇంట్లోకి వెళ్ళగానే బెదురు బెదురుగా ఆమెను రాక్కుంటూ పరుగులు తీసింది కుక్క.

"అయ్యో....! కుక్క పాడుగాను...దీనింట్ల పీనుగెల్ల. అన్నమంత పాడు చేసింది గదా! మొద్దోలె కదలక మెదలక పడుకునుడొక్కటే తెల్సుగాని గీ ఇంట్ల దిక్కు సూసుడ్లేదాయె" అంటూ మొగనిమీద మండిపడింది.

ఆ అరుపులకు రాజయ్య ముసుగు తొలగించి "ఏందే కుక్కోలే కయ్యి కయ్యిన ఒకటే అరుపు. జర ఆగలేవు" అంటూ వారించాడు.

"నీ అగుడు మీద మన్నుబడ. గంజెదన్నం గంగ పాలాయె. కుక్కొచ్చి మూతి బెట్టి కరాబు చేసె. ఇక దాన్నేం జెయ్యాలె". అంటూ క్రిందపడ్డ అన్నం గిన్నె తీసుకొచ్చి రాజయ్య ముందు పెట్టింది.

"తలుపు దగ్గరేసి గొల్లెం పెట్టిపోతె నీ ముల్లేం పోయేది." అంటూ మల్లమ్మనే దబాయించాడు.

"గుట్టంత మనిషి ఇంట్లుంటే గొల్లెం పెట్టాల్నంట గొల్లెం. ఇప్పుడేందిని పోతవో పో" అంటూ అన్నం గిన్నెను బయటకు తీసుకెళ్ళింది.

"ఏం బెదిరిత్తన్నవా? కాంటేన్ కడుపు సల్లగుంటె ఓ పూట కూడు లేకున్నా పర్వాలేదు."

ఆ మాటతో మల్లమ్మలో కోపం పోయి జాలి కలిగింది. "సరెసోలు గాని నీ మందం మల్ల బియ్యం బెడుతున్న. పొంగి పోజిక్కు సూడు, మల్ల తెల్లారితే సీల్లకు కోసెడంత లైనుంటది" అంటూ సీల్లబిందె పట్టుకొని మల్ల బయటికి నడిచి నిలబడింది.

రాజయ్య పండ్లు తోముకుంటూ "సరెపో. అటే ఉండకు," అంటూ హెచ్చరించాడు.

"పెండ్లాల దగ్గర గట్టిగా మాట్లాడుతరుగాని గా మేనేజర్ల దగ్గర ఎందుకో గట్టిగ మాట్లాడరు. బాయిల పొయ్యి మొద్దోలె పన్జేత్తారు గాని గీ పంపులన్నా ఎక్కువ ఎయ్యుమని అడక్కపోతిరి. గంత దూరంబోయి సీల్లు ఎత్తుకచ్చేటాల్ల రెక్కలు గుంజవట్టే." అంటూ వడివడిగా వెళ్ళిపోయింది.

ఒక్కరెనక ఒక్కరు సీల్లు బట్టుకొనేసరికి పావుగంట గడిచింది. తంటాలు పడి బిందెడు సీల్లు పట్టుకొని త్వరత్వరగా బయల్దేరింది మల్లమ్మ. ఎదురుగా ఉరికి వస్తున్న పంది మల్లమ్మ కాల్లకు డీకొట్టింది. మల్లమ్మ దబీల్లున క్రిందపడింది.

బిందెడు నీళ్లు భూమిపాలైనాయి గుర్రుమంటూ పంది పరుగులు తీసింది అబ్బా అంటూ మూలుగుతూండిపోయింది మల్లమ్మ.

మెల్లగా లేవడానికి ప్రయత్నిస్తున్న మల్లమ్మను ఓదారుస్తూ అరే ఏమైందే మల్లక్క. పంది తాకిందా. ఈ పందులు పాడువడా. ఎక్కడ చూసిన అవ్వే. దెబ్బ బాగ తలిగిందా?" అంటూ పలుకరిస్తూ ఆ వైపే నీళ్లు ఎత్తుకొని వచ్చిన మరో యువతి చేయిపట్టి లేపింది

మల్లమ్మ లేచిందేకాని కాలు భూమిమీద మోపడం చాలా కష్టంగా ఉంది. దూరంగా పడిపోయి ఉన్న ఖాళీ బిందె తీసుకొని ఆయాసపడుతూ కుంటుకుంటూ ఇల్లుచేరింది.

ఆమె కోసం ఎదురుచూస్తున్న రాజయ్య "అరే ఏమైంది" అంటూ ఆదుర్దాగా అడిగాడు ఆమె చేతిలోని బిందె తీసుకొని ఇంట్లో ఓ మూల పడవేసి, ఆమెను మంచాలో పడుకోబెట్టాడు. మల్లమ్మ జరిగిన విషయమంతా చెప్పింది.

మెల్లగా రాజయ్య కాలును గట్టిగా లాగి తోమసాగాడు. మల్లమ్మ బాధ భరించలేకపోయింది.

"అప్పటివరకు పెద్దపకాంద్లకు వెల్లి డాక్టరుకు చూపించుకో లేకుంటే ఎక్కువైతది" అంటూ చెప్పాడు రాజయ్య.

"మా పోతగాని, జల్దిగా అన్నం తినిపో. లేటైతే మల్ల బాయిమీద పనికి దీసుకోరు." అంటూ బాధపడుతూనే భర్తను పురమాయించింది మల్లమ్మ.

ఆ రోజు రాజయ్యకు నిజానికి భార్యను వదిలి డూటీకి వెళ్ళాలని లేదు. ఒక్కరోజు నాగ బతే వచ్చే జీతంలో కోత. ఇప్పటికే చిట్టికి డబ్బులు కట్టడానికి తల ప్రాణం తోకకొస్తుంది. అందుకే ఎంతో అత్యవసరముంటే తప్ప డూటీకి వెళ్ళకుండా ఉండడు.

మల్లమ్మకు కాలునొప్పి ఎక్కువైంది. ఐనా ఆ బాధ భర్తతోని చెప్పలేదు. ఎందుకంటే భర్త డూటీ మానివేస్తాడని ఆమెకు తెలుసు.

రాజన్న వేడి వేడి అన్నం ఆదరా బాదరగా తినసాగిండు.

"రాజన్న. రాజన్న" అన్న పిలుపు విని ఆఁ... అత్తన్నాగే మల్లన్న. జెర అట్ల గూసో." అంటూ మల్లన్నకు లోపలినుంచే చెప్పాడు.

మస్సిలా తయారైన పంచె, గోచి బిగించి, నెత్తిమీద టోపి పెట్టుకొని, బీడి కాలుస్తూ నిలుచున్న మల్లన్న లోపలికి వచ్చి ఆడ ఉన్న స్టూల్‌పై కూర్చున్నాడు.

"పొద్దుగాల పొద్దుగాల్నే మీ మరదలు సీల్లు దెత్తాంటే పంది ఉరికచ్చి తగిలిందే. దాంతో కిందపడి కాలి బెనికింది. మంచాలకెల్లి లేవడం కష్టంగానే ఉంది." అంటూ చెప్పాడు రాజయ్య.

"అరే మరి గసొంటప్పుడు నువ్వు డూటీకెందుకత్తన్నవు. కొద్దిగాగినంక డాపకాండ్లకు తీసుకపో" అంటూ సలహా ఇచ్చాడు.

"నేం గట్లనే అనుకుంటే మీ మరదలేమో ఏంగాదు పొమ్మంటుంది. గా ఓర్‌మెన్ సాబ్‌కు జర చెప్పి ఇంటికత్త"

"అదెక్కడికచ్చే ఓర్‌మెన్‌కు పదో పదిగేనో ఇయ్యాల్నా. ఓ లీవుంటే పెట్టలేవు. ఆదట్టిగా ఇంటికి పంపిత్తడా"

"లీవుల్లేవే."

"సరే నీ ఇష్టం.' అంటూ లేచాడు మల్లన్న.

వందిరికి తలిగేసిన బెల్టు, టోపి తీసుకొని, సగం వరకు చినిగిన మైనింగ్ బూట్లు కాళ్ళకు తగిలించుకున్నాడు. బావ్య దగ్గరకోసాకె వెళ్ళి చెప్పి, పోదాం పద.

అంటూ మల్లన్నతో గడపదాటి బయటకు వచ్చి అంతకుముందే బయటకు తీసిన డొక్కు సైకిల్ ఎక్కిండు, నేం జెల్దిగనే వస్తా" అంటూ భార్య దిక్కు చూశాడు ఆమె కళ్ళు తెరచి ఆయన ముఖంలోకి చూసింది.

డొక్కు సైకిల్ తొక్కుతూ మల్లన్నను వెంబడించాడు రాజన్న.

రాజన్న, మల్లన్న, ఇద్దరు ఒకరి ప్రక్కన సైకిల్ నడిపిస్తూ ఇరుకు సందుల్నుండి రోడ్డెక్కిండ్రు. గప్పుడే రగరగమనే సూర్యుని ఎండపొడుపు కండ్లకు సూటిగా కొడుతుంది. వందల సైకిళ్ళు, వేల సైకిళ్ళు రోడ్డువెంట ఎడతెగని చీమల బారులా సాగుతూనే ఉన్నాయి. ఎదురుగా బొగ్గులారీలు, ఆటోలు వస్తూంటే ప్రక్కనే సైడుకు నడిచే అనేక సైకిళ్ళు దారలాగా నడుస్తున్న సైకిళ్ళు ఒక్కసారే ఎకదుకో ఆగాయి. ఒక్కటివెనక ఒక్కటే ఎక్కడివక్కడే నిలబడ్డాయి. రాజన్న, మల్లన్న ఏమిటని ముందుకు మెల్లమెల్లగా సైకిల్లను నడిపించుకుంటూ వెల్లారు. ఓ సైకిలును ఆటో గుద్ది సైకిలు రిం వనిగిపోయింది. పాపం ఆ కార్మికునికి దెబ్బ తలిగింది. ఆయన్ను ఓ ఆటో చూసి దాంట్లో ఆస్పిటల్‌కు పంపిందారు. అక్కడో పది నిమిషాలు గడిచింది. మెల్లమెల్లగా సైకిళ్ళు ముందుకు నడిచాయి. ప్రతిరోజు గని కార్మికులతో చీమల బారులో కనిపించే ఆ రోడ్డుమీద ఎప్పుడేం జరుగుతూందో తెలియని పరిస్థితి. రోజు ఎవరో ఒకరు ప్రమాదంలో చిక్కుకుంటారు. ఆ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారుకూడా చాలామంది. వచ్చిపోయే వాహనాలతో, సైకిల్లతో రద్దీగా ఉండే ఆ రోడ్డును విశాలంగా చేస్తామనే ఆలోచన కంపెనీవాల్లకు ఎందుకు లేదో రాజన్నకు అంతుపట్టని ప్రశ్న. బాయిమీదకు సమయంలో చేరుకోవాలని నరాలన్ని పీక్కుపోతుంటే, కాల్లు జువ్వుస గుంజుతుంటే ఒల్లంతా చమటలు కక్కుతూంటే మల్లన్న, రాజన్నలు సైకిల్ తొక్కుతూనే ఉన్నారు. రోజు పది కి మీ. దూరం సైకిల్ తొక్కడం వారికలవాటేఐనా ఇట్లా ఎన్నాళ్ళు తొక్కడమనే ఆలోచన, బాధ వారిలో కలుగకపోలేదు, ఇంకా వారికన్నా దూరంగా పదిహేను కిలోమిటర్లు సైకిల్ తొక్కి డూటికి వెల్లేవారి పరిస్థితి ఎంత బాధాకరమో ఊహించుకొని తమకు తామే సంతృప్తి పడేవారు తమలాగా సైకిల్ తొక్కడం చేతకానివారు సి.యస్.పి. వరకు సైకిల్లమీద వెళ్ళి అక్కడ అపి పెట్టి బొగ్గు

ట్రాన్స్‌పోర్టింగ్ లారీల్లో డూటీలకు వెళుతారు. వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. కాని సి.యస్.పి వరకు రాజన్న ఇంటినుండి అర్ధగంట తొవ్వ నడ్వాలి. బస్సులో వద్దామంటే సరిపోయేన్ని బస్సులుండై. చాలీచాలని బస్సుల్లో ఒక్కరిని మించి ఒక్కరు పోటీపడి ఉరుకులు పరుగులతో ఎక్కడమంటే రాజన్నకు మహా విసుగు. అందుకే సైకిల్ తొక్కి డ్యూటీకి వెళ్ళడమే ఉచితమనుకున్నాడు.

రాజన్న, మల్లన్నలు సైకిల్లు సైకిల్ షడ్డులో పెట్టి మాన్‌వే కాడికి వెల్లి ఇద్దరు మస్టర్లు చెప్పారు. ఎదురుగా ఉన్న కాంటెన్‌లోకి ఇద్దరు నడక సాగించారు. అప్పటికే కార్మికులతో కాంటెన్ కిటకిటలాడుతూంది. ఎవరో తిడుతుంౘడు. "గింత పొద్దున్నే వడలొడ్సినాయిరా, బగ్గ బాయి దొరలు తింటరు గాని మాకద్దా" అంటూ వడలిచ్చే లచ్చుమయ్యను తిట్టడం మొదలు పెట్టింౘడు.

కొద్దికొద్దిగా జనం కాలీ ఐతాంటే రాజన్న లేచి "మల్లన్న నువ్విన్నే కూచోవే. నేంవెల్లి చాయ దెస్త" అంటూ జేబుల్నుండి చిల్లరదబ్బులు లెక్కబెట్టుకొని చాయ పోసెటాయనకిచ్చి రెండు కప్పులు తీసుకొచ్చిండు. ఇనుప కుర్చీలపై చెరో ప్రక్కన కూర్చుండి చాయదాగి బయటపడ్డారు. "ఇగో మల్లన్న. గా ఓర్‌మెన్‌ను కలిసస్త" అంటూ ఓర్‌మెన్ రూం వైపు నడిచిండు రాజయ్య

అప్పుడే డిస్ట్రిబ్యూషన్ లిస్టు పట్టుకొని మొండి నెక్కరేసుకొని రూంలో నుండి బయటకు వస్తున్న ఓర్‌మన్‌ను చూసి నమస్తే పెట్టిండు.

"నమస్తే నమస్తే" అంటూ నవ్వుతూ నమస్కారం చేసిండు ఓర్‌మన్.

"సార్ ఇయ్యాల కొద్దిగ చూసుకోవాలె" అంటూ వెనక వెనక మెల్లగా రాశాగాడు రాజన్న

"ఎందుకురో గట్లచ్చి గిట్ల సూసుకోవాల్నంటే ఎట్లా" వెనకకు మల్లి చూస్తూ అన్నాడు ఓర్‌మెన్.

"అదిగాద్దొర. మా ఇంట్ల ఆడది పడిపోతే కాలిరిగిరది. జర పెద్దావకాన కెల్లాలె." అంటూ ప్రాధేయపడ్డాడు.

దొర అనేటాల్లకు చెట్టంత ఓర్‌మన్ గుట్టోలె ఉబ్బి పోయిండు. ఆ సంతోషంతోనే సరె పోగాని గా అండర్ మేనేజర్‌దొరసూడజిక్కై పైలం. ఎవ్వని కన్న జెప్పు లైటు దేచ్చి మల్ల అప్పజెప్పమను" అంటూ సలహా ఇచ్చాడు.

బావిలో దిగాలంటే చీకటిలో లైటు వాడాలి. లైటు ల్యాంప్ రూంలో నంబర్ చెప్పి తేచ్చుకోవాలి. డ్యూటి ఐపోగానే లైటు వాపసు ఇవ్వాలి. అప్పుడు నంబర్ నోట్ చేసుకుంటారు లైటు ఏ కార్మికుడు తీసుకువెళ్ళాడో. లాంప్‌రూంలో నంబర్లు హాజరు వేసుకున్న రిజిస్టర్లో నంబర్లు సరిచూసుకుంటారు. కిలోల బరువు కలిగిన ఛార్జీ చేయబడిన లైటును బెల్టుతో నడుంకి కట్టుకొని దిగాలి. ఆ లైటు నుండి (బ్యాటరిబాక్సు) వచ్చే కేబుల్‌ను తలమీద టోపికి తగిలించుకుంటారు ఆ కేబుల్ చివర లైటు వెలుగుతుంటుంది చూసే వారికది హనుమంతుని తోక లాగ కనబడుతుంది. స్విచ్ వేస్తే రైలింజన్‌కు వెలిగినట్లు నెత్తిమీద తగిలించుకున్న లైటు వెలుగుతుంది భూగర్భంలో ఆ లైటు వెలుతురుతోనే కార్మికులు పని చేస్తారు.

ఓవర్మన్ అందరిని ఏఏ స్థలంలో పనిచేయాలో పంచినతర్వాత కార్మికులు రట్టాలు చెమ్మసు పట్టుకొని, ఫిల్లింగ్ కార్మికులు షాట్ ఫైరర్లు, కోల్ కట్టర్లు, ఫిట్టర్లు ఎలక్ట్రిషన్‌లు తదితర కార్మికులు దిగారు. కొందరు కాంటీన్‌లోకి వెళ్ళి టిఫిన్ చేస్తున్నారు.

రాజన్న మెల్లగా ఎవ్వరు చూడకుండా కుక్కి సైకిల్ మీద ఇల్లు చేరాడు. నడుంకు బిగించిన లైటు, నెత్తిమీద టోపి తీసి గుడిసె సూరులో చెక్కిండు. చిని గిన మైనింగ్ బూట్లు విడిచి ఓ మూలన పడేశాడు.

మల్లమ్మ ఇంక లేవనేలేదు "ఏమైంది ఇంకా నొప్పి పెట్టిందా? అంటూ కాలును పరీక్షించాడు. కాలు వాపెక్కింది. "అరెరె ఇదేందే కాలంత బూరె పొంగి

నట్లు పొంగింది. లేలే జెల్దిగ దావకాండ్లకు పోదాం అలిసమైతే అక్కడ మల్ల నిలబడి నిలబడి యాష్టత్తది'' అంటూ రాజన్న తొందర చేశాడు. మూలుగుతూ మల్లమ్మ లేచింది ఓ కాలు ముందు కేసిందో అమ్మమ్మ అంటూ కులబడిపోయింది రాజన్న అమాంతం ఆమెను చేతులమీద ఆనించుకొని బయటకు తీసుకువచ్చి సైకిల్ వెనుక సీటుమీద కూచోబెట్టిండు. మల్లమ్మతో సహా సైకిల్‌ను మెల్ల మెల్లగా నెట్టుకుంటూ పెద్ద హాస్పిటల్‌కు చేరుకున్నాడు. అప్పటికే లైను పెరిగిపోయింది మల్లమ్మను ఓ ప్లాస్టిక్ కుర్చీమీద కూర్చోబెట్టి నంబరు చిట్టి రాయించడానిక్కి వెళ్ళి వచ్చాడు.

జనం ఒక్కొక్కరు లోపలికెళ్ళి వస్తూనే ఉన్నారు. రాజన్నకు నిలబడి నిలబడి యాష్టచ్చింది.

"ఈ మంది ఇప్పుడయెటట్లులేరు. నేం గా రోడ్డు దాక పోయి ఓ చాయ దాగత్త'' అంటూ బయటకు నడిచాడు

బయట చాయోటేల దగ్గర చాయి తాగుతూంటే తనతో పనిచేసే ఓ కార్మికుడు కంటబడితే బలవంతంగా ఆయనకోచాయ ఇప్పించాడు.''మా నాయన ముసలోడు పదిరోజుల్నుండి జరంతో సత్తండే'' అంటూ ఆ కార్మికుడు రాజన్నతో మనసువిప్పి చెప్పాడు. రాజన్న తన భార్య పడిపోయిన విషయం చెప్పాడు ఆ కార్మికుడు బాధ పడ్డాడు ఇద్దరు ఇంటి విషయాలు విడిచి బాయి పని విషయాల్లోకి దిగారు ఓవర్‌మన్‌ల విషయాలు ఆ తర్వాత అండర్ మేనేజర్లు మేనేజర్ల విషయాలు మాట్లాడుకొంటున్నారు ఈ లోగా కంపెనీ లారీ ఓ పదిమంది కార్మికులతో వేగంగా హాస్పిటల్ ఆవరణలోకి దూసుకు వచ్చింది. దాన్ని చూస్తూనే వారిద్దరికి అర్థమైంది. తమ తోటి కార్మికుడు ఎవరో ప్రమాదంలో ఉన్నారని వెంటనే ఇద్దరు ఆ లారీ వైపు పరుగు తీశారు.

తెగిన గాయాల్లో నుండి రక్తం కారుతున్న కార్మికుడు, స్పృహలేని కార్మికుడు, శరీరమంత నల్లగా బొగ్గు మైలతో కప్పబడిన కార్మికుడు ఓ ఐదుమంది

చేతులమీదుగా లోపలికి తీసుకుపోబడ్డాడు. ఆయన మొఖం చూస్తూనే రాజన్న గుండె దడేల్లుమంది. అయన ఎవరో కాదు. తన గాంగులోనే పనిచేసే ఫిల్లింగ్ కార్మికుడు లచ్చుమయ్య. వారి వెంబడే లోపలికి పరుగులు తీశాడు. కాని డాక్టరు కొద్దిసేపైన తర్వాత అందర్నీ బయటకు పంపాడు. రక్తం కావాలన్నాడు. ఇప్పుడిప్పుడే ఏం చెప్పలేమన్నాడు. అందరూ పాలిపోయిన ముఖాలతో బయటకు వచ్చారు. బాయి మేనేజరుకు కబురు పంపారు. అతనికి సరిపోయే గ్రూపు రక్తం కార్మికులను పంపించమని.

రాజన్న వివరంగా అడిగాడు. ఆ ప్రమాదం ఎట్లా జరిగిందని. పొద్దున్నే బొగ్గు త్వర త్వరగా నింపాలనే తొందర్లో ఉండి పనిచేస్తుండగా ప్రక్కనుండి పెద్ద బొగ్గుపెల్ల మీదపడి కాల్లకు తలకు బలమైన దెబ్బలు తగిలాయని ఆ కార్మికులు చెప్పారు.

రాజన్న మండిపడ్డాడు. బ్లాస్టింగ్ చేసినంకా తనిఖీచేసే వారు సరిగా తనిఖీ చేస్తే ఈ ప్రమాదం జరిగేదికాదు కదా, అని ఆవేశపడ్డాడు. "అధికారుల అజాగ్రత్త వల్ల దినం గిలాంటి ప్రమాదాలు జరుగుతనే ఉన్నాయి" చస్తనే ఉన్నారు. ఐనా వారికి చీమ కుట్టినట్టైన లేదు. అంటూ బిగ్గరగా అరచాడు. ఐనా తన అరుపులు గోడలు తప్ప ఎవ్వరు వింటున్నారని నిస్సహాయుడి ఆర్తనాదం ఆ సమయంలో ఎవరు పట్టించుకోలేదు. లచ్చుమయ్య బతకాలని దేవున్ని వేడుకున్నాడు. కంపెనీ అధికారులను తిట్టుతూనే భార్యదగ్గరికి వచ్చాడు.

వచ్చేసరికి లైను దగ్గర పడింది. మల్లమ్మ వంతు వచ్చేసరికి రెండు గంటలు పట్టింది. మల్లమ్మను మెల్లగా పట్టుకొని వెళ్లి డాక్టరు ప్రక్కన స్టూలు మీద కూర్చోబెట్టాడు.

డాక్టరు వివరాలడిగి మల్లమ్మ కాలును పరీక్షిస్తుండే ఓ ఇద్దరు మనుషుల సహాయంతో కుంటుకుంటు వచ్చి డాక్టరు ముందు ప్రత్యేకంగా వేసిన కుర్చీలో కూర్చున్నాడు ఆ వ్యక్తిని చూస్తూనే డాక్టరు మల్లమ్మను మరిచాడు. "ఏమైంది సార్" అంటూ ఆశ్చర్యంగా పలకరించాడు

"నిన్న స్కూటర్ మీద వస్తుంటే ఆక్సిడెంటై కాలుకు దెబ్బ తగిలింది" అంటూ వివరించాడు.

"అరెరె ఇంతాలస్యమెందుకు చేశారు. నొప్పేం లేదుకదా!" అంటూ "స్పెషల్ రూంలోకి తీసుకువెల్లండి నేను వస్తాను" అంటూ రూం నంబర్ చెప్పాడు అతనితో వచ్చిన వ్యక్తులతో.

వారా వ్యక్తిని తీసుకుని వెళ్ళారు.

డాక్టర్ ఆదుర్దాగా స్టెతస్కోప్ పట్టుకొని వారినే అనుసరించాడు

ఆ వ్యక్తి ఎవరో కాదు బాయి మేనేజర్. అందుకే అంత హడావుడి. డాక్టరు అనుసరించేంతటి శక్తి ఆ మేనేజరులో ఉంది. కాదు, వ్యవస్థ అతనికా శక్తి కల్పించింది.

కష్టించేది మేము. భూమి కడుపులో దూరబడి ప్రాణాలమీద ఆశ వదిలి నల్ల బంగారాన్ని బయటకు తీసేది మేము. కోట్లకొలది లాభాలు సంపాదించి పెట్టేది మేము. కాని అన్నిటి పైద అధికారం చెలాయించి అనుభవించేది మాత్రం దొరలు—బాయి దొరలు-

రాజయ్య గుండె బద్దలయేంత బాధ- ఆ బాధలో ఆవేశం పొంగింది- అంతే... డాక్టర్... అని పొలికేక వేశాడు. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. రాజయ్య గుండెలో అగ్గి రాజుకుంటుంది.... ***


చదవండి చదివించండి

# శాంతి - స్నేహం

(తెలుగు మాసపత్రిక)

సంవత్సర చందా రూ. 20/-లు

313, అమృతా ఎస్టేట్స్. హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029.